

# చైతన్యరాహిత్యంలో స్త్రీ

– పవని నిర్మల ప్రభావతి

పధ్నాలుగేళ్ళు అరణ్య వాసం చెయ్యటానికి బయల్దేరిన సీతారాములను లక్ష్మణుడు అనుసరించినప్పుడు అతని అర్ధాంగి ఊర్మిళ, భర్తను అనుసరించ లేకా, రాజాంతఃపురంలో జీవచ్ఛవంలా బ్రతకలేకా చైతన్య రాహిత్య స్థితిలోకి జారిపోయి దీర్ఘనిద్రను ఆశ్రయించింది.

ఆమెకా దుస్థితి కల్గించిన వారెవ్వరూ  ఆమె పట్ల జాలి చూపించ లేదు.

చరిత్ర కూడా ఆమె మానసిక పరిస్థితిని విశ్లేషించలేదు.ఈనాటి అధునాతన సమాజంలో కూడా ... పరిస్థితుల ప్రభావం వల్ల కొందరు స్త్రీలు ఎటువంటి చైతన్య రాహిత్య స్థితిని ఆశ్రయిస్తున్నారంటే అందుకు కారణం ఏమిటి?

మారుతున్న సమాజంలో కూడా స్త్రీలకు ఈ దుస్థితి తప్పక పోతే, ఇహ, అందరూ ఆశిస్తున్న 'మార్పు'కు అర్థం ఏమిటి?

నేటి సాంఘిక సమస్యలను కథా వస్తువుగా తీసుకుని అతి హృద్యమంగా మలచిన శ్రీమతి పవని నిర్మల ప్రభావతి గారి రసవత్తర నవల "చైతన్య రాహిత్యంలో స్త్రీ"

ప్రతి ఒక్కరూ తప్పక చదివి తీరాల్సిన నవల ఇది.

*(గత సంచిక తరువాయి)*

**లలిత** ఏం చెప్పినా ఇలాగే లైట్ గా గమ్మత్తుగా చెబుతుంది. ఆమె మాటలు మరీ మరీ వినాలనిపిస్తాయి.

ఊర్మిళ చిరునవ్వు నవ్వింది. లలిత, రాజుల దాంపత్యం చాలా ముచ్చటగా వుంటుంది. రాజు లాయర్, లలిత డాక్టరు. ఒకరిది సాంఘిక పరమైన న్యాయం చేకూర్చే వృత్తి అయితే, మరొకరిది దైహిక మానసిక ఆరోగ్యాన్ని సమకూర్చే వృత్తి. ఇద్దరి కిద్దరూ లీడింగ్ ప్రాక్టీసు వుంది. అయినా ఇద్దరి కిద్దరు తమ కోసం అంటూ కొంత సమయాన్ని కేటాయించుకుని నవ్వుతూ, ఎదుటి వారిని నవ్విస్తూ కాలం వెళ్ళబుచ్చుతుంటారు. వాళ్ళిద్దరిలో ఏ ఒక్కరున్నా అక్కడ చైతన్యం వెల్లి విరుస్తుంటుంది. ఇద్దరూ వుంటే ఇక వాతావరణం చైతన్య స్వరూపమే అవుతుంది,

"ఏమిటే అలా చూస్తున్నావు. కొంపదీసి ఆపరేషన్ అనగానే మతి పోయిందేమిటి? భయపడి పోయావా?" అంది లలిత ఊర్మిళ జబ్బ మీద చనువుగా చరుస్తూ.

"ఛ... ఛ... భయపడటానికి నేనేం చిన్నపిల్లనా?"

"కాదు కనకే భయం. పిల్లలయితే ఎంచక్కా ఏం చేస్తామో తెలీదు కాబట్టి చెప్పినట్లు విని టేబిల్ మీద పడుకుంటారు.

"లలితా! ఎనస్తీషియా ఇచ్చేటప్పుడు బాధగా, ఉక్కిరి బిక్కిరిగా ఉంటుందా?" కొంచం కుతూహలంగా అడిగింది ఊర్మిళ.

"ఎంచక్కా నీకు ఇష్టమైన ప్యూర్ కాఫీ, ఫిల్టర్ డికాషనుతో కాఫీ తెల్లారుఝామున పళ్ళు తోముకోగానే ఎవరేనా తెచ్చి ఇస్తే యెంత హాయిగా వుంటుందో అలా వుంటుంది." నవ్వుతూ అంది లలిత.

"వెధవ జోకులు మానేసి ఎలా వుంటుందో చెప్పు. మెంటల్ గా ప్రిపేర్ అవుతాను" అంది ఊర్మిళ చిరాకుగా.

"మెంటల్ గా ప్రిపేర్ అవుతావూ! ఉరిశిక్షకో, ఆత్మహత్యకో ప్రిపేరు అయినట్లు! అసలు మరో డాక్టర్ అయితే నీ ఆపరేషను గురించి నీకు పిసరంత వివరం ఇవ్వదు. ముక్కు ఎగబీల్చి కనుబొమలు పైకెత్తి నిన్నో ప్రయోగశాలలోని ప్రాణిగా పరిగణించి పోజు వేసేది. ప్రాణస్నేహితురాలిని కాబట్టి అన్ని వివరాలూ చెప్పాను. నీకు గర్భకోశంలో గడ్డ ఏర్పడిందనీ, గర్భకోశం తొలగించాలనీ, మేజర్ ఆపరేషన్... అన్నీ వాగేశానా? ఇంకా ఎనస్తీషియా ఎలా ఇస్తావు?యెలా వుంటుంది? ఆపరేషను టైంలో ఏ ఏ పరికరాలు వాడుతావు అన్నవి చెప్పమంటావు మై డియర్ ఊర్మిళాదేవీ! చచ్చే సస్పెన్సు అంతా నిన్ను ఆపరేషన్ థియేటరులోకి తీసుకు వెళ్ళాక ప్రారంభం అవుతుంది. అప్పుడు హాయిగా స్పృహ లేని చైతన్య రాహిత్యంలో నువ్వూ, నీ కేసుతో దాని సక్సెస్ తో మేమూ తన్నుకు చస్తుంటాము. ఏ కాంప్లికేషన్స్ లేకుండా కేసు సక్సెస్ అయ్యే వరకూ డాక్టరుకి ఆ టెన్షను తగ్గదు అంచేత నువ్వు నిశ్చింతగా పడుకో. మా బాదేదో మేం పడతాం. అన్నట్టు ఇది ధనుర్మాసం కదా? ఉదయాన్నే తిరుప్పావై రేడియోలో విన్నా అర్థమై చావదు. అంచేత నాకు ఇష్టమైన లక్ష్మీ నృసింహ సహస్రనామం టేప్ చేయించాను. సాధారణంగా లక్ష్మీ నృసింహ సహస్ర నామస్తోత్రం టేప్ చేసింది వినిపించ లేదెప్పుడు. మొన్నను మాకు తెలిసిన ఓ ఆచారిగారు వచ్చారు. మా రాజు గ్రామం నుంచి. ఆయన లక్ష్మీ నృసింహస్వామి ఉపాసకుడట. చాలా అద్భుతమైన కంఠస్వరం. ఎలాగూ వచ్చాడు కదా అని మా రాజు, నేనూ ఆయన చేత లక్ష్మీ నృసింహస్వామి సహస్ర నామ స్తోత్రం టేప్ చేయించాం. వింటావా! విను పుణ్యం. టైం పాసవుతుంది.

రాజు ఆఘాయిత్యంగా టెంకాయ కొట్టడం, హారతిస్తూ గంట వాయించటం కూడా టేప్ చేయించేశాడు, స్తోత్రంతో బాటు. పైగా అన్నాడు. స్తోత్రం విన్నాక రోజూ టెంకాయ కొట్టి నైవేద్యం పెట్టిన అనుభూతి కూడా పొందుతాం కదా' అని" పడీ పడీ నవ్వింది లలిత.

ఊర్మిళకీ నవ్వొచ్చింది.

లలిత నర్సుని కేకేసి మేడ మీద తమ పోర్షన్ లో కెళ్ళి టూ ఇన్ వన్ తెమ్మని పురమాయించింది.

నర్సు కాస్సేపట్లో తెచ్చి ఇచ్చింది.

"ఇదో ఈ టేప్ పెడుతున్నాను, ఆటోమేటిక్ సిస్టం. నువ్వేం కంగారు పడొద్దు. టేప్ పూర్తి కాగానే దానంతట అదే స్విచ్ పైకి వచ్చేస్తుంది." టేప్ ఆన్ చేసి వెళ్లిపోయింది లలిత.

టేప్ లో నృసింహ సహస్ర నామ స్తోత్రం ప్రారంభం అయింది శ్రావ్యంగా.

తను ఊర్మిళ! మరో కాస్సేపటిలో తను ఆపరేషను టేబిల్ మీద అచేతనంగా వుంటుంది. ఆ స్థితి యెలాటిది? ఆనాటి ఊర్మిళ నిద్రలాటిదా? లేక సబ్ కాన్షస్ మేలుకొని వుంటుందా? తనకేం జరుగుతుందో తనకు తెలియక పోవచ్చు. కానీ తన మెదడు పొరల్లోని ఆలోచనలేవో సాగిపోతూనే ఉంటాయా?

ఆనాటి ఊర్మిళ పధ్నాలుగేళ్ళు నిద్రపోయింది. తను నిద్ర పోయిందా? నిద్ర లేని రాత్రులు స్లీపింగ్ పిల్స్ తో నిద్ర పట్టించుకున్న రాత్రుళ్ళు. దీర్ఘనిద్ర పోతే బావుండునని కోరుకున్న రాత్రులు. పధ్నాలుగేళ్ళు యెలా గడిచి పోయాయి? ఈ నాడు తనూ ఒకానొక చైతన్య రాహిత్య స్థితిలో వుందా? పెళ్ళయి తనకీ పధ్నాలుగేళ్ళు దాటి పోయాయి. మనసూ శరీరమూ యెదిగింది కానీ మెదడు మొద్దుబారి పోయింది. యెప్పుడో లలిత లాటి ప్రాణస్నేహితురాలి సాన్నిహిత్యంలో తప్ప అది పని చెయ్యటం మానేసింది. పుట్టుక, పెరగటం, యవ్వనం, పెళ్లి, దాంపత్యం, సమస్యలు, మృత్యువు... ఇదేనా జీవితం. వీటన్నిటి మధ్యా పొందే అనుభూతుల్ని బట్టి ఆ వ్యక్తి లోని చైతన్యం వికసించటమో, నీరసించి పోవటమో జరుగుతుందా? తను ఒకానొక చైతన్య రాహిత్య స్థితినే కోరుకొంటోంది.

రామానుజం గుర్తుకు వచ్చాడు.

తన ఆస్తి కోసం ... సీతక్క కంటే ఏమాత్రం అందంగా లేని తనని పెళ్ళాడాడు.

ఆస్తంతా తనపరం చేసుకునే వరకూ ప్రేమగానే చూశాడు. తర్వాత ఉమెన్ వీక్ నెస్! సీతక్క రాక...

సీతక్క అలా ప్రవర్తించగలదని తను కలలో కూడా ఊహించలేదు.

తన దృష్టిలో ఏ భార్యా భర్తకు ద్రోహం చేయకూడదు. చేయదు.

కానీ జరిగిందేమిటి?

తనిప్పుడు ఏకాకి.

ఇక బిడ్డలు పుట్టే అవకాశం లేదు.

భర్త తనవాడు కాదు. సీతక్క స్పష్టంగా చెప్పేసింది. త్వరలో తాను రామానుజం మరో భార్య స్థానంలో ఇక్కడే పబ్లిక్ గా వుండి పోతానని.

రామానుజం 'అవును' అన్నాడు.

పెదనాన్న లేరు. తలిదండ్రి లేరు.

తనీ లోకంలో ఏకాకి.

తనీ ఆపరేషన్ అయి కోలుకున్నాక?

ఉద్యోగం చేస్తూనే వుంటుంది. ఎందాకా? రిటైర్ య్యే వయసు వరకూ. ఎవరి కోసం?

తన ఒక్క పొట్ట కోసం.

ఆ ఉద్యోగం చేయకుంటే రామానుజం... తన భర్త, సీత తనకు అన్నం కూడా పెడతారన్న నమ్మకం లేదు. అసలు మొన్న రాత్రి ఆ దృశ్యం చూడగానే తనెందుకు చనిపోలేదు? మెదడు చైతన్యాన్ని ఎందుకు కోల్పోలేదు?

"పశ్యామిత్వాం మహా సింహం
హారిణం వనమాలినం
కిరీటనం కుండలినం
సర్వగం సర్వతోముఖం
సర్వతః పాణి పాదోరుం, సర్వతోక్షి శిరోముఖం
సర్వేశ్వరం సదాతుష్టం సత్వస్త్యం సమరప్రియం
బహుయోజన విస్తీర్ణం, బహు యోజనమాయితం
బహుయోజనసహస్త్రాం ఘ్రీం, బహుయోజన నాసికాం
నమోస్తు నారాయణ! నారసింహ!
నమోస్తు నారాయణ! వీరసింహ!
నమోస్తు నారాయణ! క్రూరసింహ!
నమోస్తు నారాయణ! దివ్యసింహ!

నమోస్తు నారాయణ! వ్యాఘ్రసింహ!

నమోస్తు నారాయణ! పుచ్ఛసింహ!

నమోస్తు నారాయణ! పూర్ణసింహ!

నమోస్తు నారాయణ! రౌద్రసింహ!

నమో నమో భీషణ భద్రసింహ!

నమో నమో విజ్వల నేత్రసింహ!

నమో నమో బృంహిత భూతసింహ!

నమో నమో నిర్మల చిత్తసింహ!

నమో నమో నిర్జిత కాలసింహ!

నమో నమో కల్పిత కల్పసింహ!

నమో నమః కామద కామ సింహ!

నమో నమస్తే భువనైక సింహ!"

టేప్ లోని ఆచారిగారి కంఠం భక్త్యావేశంతో ఖంగున అద్భుతంగా సాగుతోంది

ఊర్మిళ త్రుళ్ళిపడ్డట్లు బెడ్ మీద లేచి కూర్చుంది. తన ఆలోచనల్లో తానుండి, ఇందాకా సరిగా వినలేదు. ఈ విన్న కాస్తంతా, ఆమె హృదయంతరాళాలను స్పృశించి తట్టి మేల్కొలిపినట్లయింది.

పెదనాన్న ఇలాటి భక్త్యావేశంతోనే చేసేవారు సహస్ర నామార్చన ధనుర్మాసంలో. ప్రతి తెల్లవారు ఝామున! లక్ష్మీ నృసింహ సహస్రనామ స్తోత్రం సరిగ్గా ఇలాగే చేదివేవారు గంభీర స్వరంతో.

ఆ రోజు గర్భగుడి ఇవతలగా వైకుంఠ ఏకాదశి రోజు ఇలాగే విష్ణు సహస్ర నామార్చన అతి భక్త్యావేశంతో పూర్తి చేసి భక్తులు ద్వార దర్శనానికి వచ్చే లోగా మంత్రోపదేశం చేశారు.

ఓ విధంగా వో దివ్యానుభూతికి లోనైంది.

ఈ క్షణంలో అలాటి దివ్యానుభూతి కలుగుతోందీ స్తోత్రం వింటూ ఉంటే.

ఈ గడచిన గతం అంతా తనకు ఓ నిర్లిప్తతనే ప్రసాదించింది. జీవితంలో థ్రిల్ అంటూ మరేం మిగిలిలేదు. పెదనాన్న అన్నట్లు కొన్ని బంధాలు తనకు తగులుకున్నాయి. అవి వదిలిపోయే టైం వచ్చిందా?

తాను ఒకానొక సమాధి స్థితి కోరుకొంటోంది.

అది లభ్యమౌతుందా?

ఆమె అలా వింటూనే వుందా స్తోత్రం. హఠాత్తుగా ఆమె బెడ్ మీద అచేతనంగా పడి పోయింది.

"రా రామచంద్రం" అంది ఆలిత ఆదుర్దాగా.

రామచంద్రం, సుమతి హైదరాబాదు చేరారు. లలితా నర్సింగ్ హోం ముందు కారాపుతూ డ్రైవర్...

"సార్! వచ్చేశాం" అనేంత వరకూ రామచంద్రం వో విధమైన మగత నిద్రలోనే వున్నాడు. గతంలోనే అనేకానేక సంఘటనల్ని కథలా, దృశ్యాలుగా అతని మనసు రూపొందించింది ఇందాకా. అందులో తనకు బొత్తిగా సంబంధం లేని పాత్రలూ, సంఘటనలూ కూడా తన చూచినట్లు, విన్నట్లు దృశ్యాలుగా చూపిందా మనస్సు! దీనినే ఊహ లేక భావుకత అంటారేమో!

"ఊర్మిళకు ఎలా వుంది? ఏమైంది?"

అన్నాడు కారు దిగుతూనే లలితతో.

"రా! రామచంద్రం" అంటూ తన నర్సింగ్ హోంలోని పదహారో నంబరు విశాలమైన గదిలోకి దారి తీసింది లలిత.

"నిన్న ఉదయం టేప్ రికార్డర్ ఆన్ చేసి వెళ్లాను ఊర్మిళకి ఇష్టం కదా అని. ధనుర్మాసంలో ఆమె ప్రతి వేకువఝామున చాలా నియమంగా పూజ చేసుకుంటుందని తెలిసినదాన్ని కాబట్టి, నేను టిఫిన్ తిని వచ్చేసరికి అచేతనంగా పడి వుంది బెడ్ మీద. సాయంత్రం వరకూ స్పృహ రాలేదు. నీకు కబురు చేశాను. ఆ కమలలా కోమాలోకి జారిపోయిందా?" ఆదుర్దాగా అంది లలిత.

రామచంద్రం ఊర్మిళ వేపు చూశాడు.

దీర్ఘనిద్ర కోరుకుంటున్న దానిలా, దీర్ఘనిద్రలో శాంతి పొందగోరిన దానిలా ప్రశాంతంగా ఉంది ఆమె ముఖం!

"మొన్న అబార్షన్ అయింది. తీవ్రమైన మానసిక ఆందోళనకు గురైనట్లుంది. కానీ ఎంత అడిగినా చెప్పలేదు. బహుశ సీత, రామానుజంల వరస చూసో, తెలిసో?" లలిత ఆగింది.

రామచంద్రం తల పంకించాడు మౌనంగా.

ఊర్మిళ చిత్తుగా వ్రాసిన కాగితాలు కొన్ని ఈ మధ్యనే కమలకు చూపి కథగా మలచమన్నాడు తనే.

ఆ చిత్తు కాగితాలు తన వెంట పట్టుకు వచ్చాడు కూడా మళ్ళీ. కమల అద్భుతంగా మలుస్తోంది వాటిని కధగా.

కమల చైతన్యాన్ని పుంజుకొంటోంది.

ఊర్మిళ చైతన్యం కోల్పోయింది.

"రామానుజం ఏమన్నాడు?" అడిగాడు రామచంద్రం. రామానుజాన్ని నరికి పోగులు పెట్టాలనిపిస్తోంది.

"ఈ స్పృహ లేని మనిషిని ఇంటికెలా తీసుకు వెళ్ళడం? ఇక్కడే వుంచమన్నాడు." నిర్లిప్తంగా అంది లలిత.

"నాకు తెలుసు లలితా! ఊర్మిళ యెప్పుడో ఇలాటి స్థితిలో పడిపోతుందని." ఆవేదనగా అన్నాడు రామచంద్రం.

*(ముగింపు వచ్చే నెలలో)*

Post your comments